

భక్తులు రద్దీతో కిటకిటలాడుతున్న కాణిపాకం ఆలయం

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## శ్రీవారి ఆశీస్సులతో జాతీయ కార్మిక సదస్సు విజయవంతం

–జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



తిరుమల, ఆగస్టు 28ప్రభాతవార్తప్రతినిధి:

తిరుపతి జిల్లాలో రెండురోజులపాటు తొలిసారిగా నిర్వహించిన జాతీయ కార్మిక సదస్సు విజయవంతం కావడంతో జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తిరుమలకు చేరుకున్నారు. ఆదివారం ఉదయం కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చిన కలెక్టర్ ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. జాతీయసదస్సు స్వామివారి ఆశీస్సులతో విజయవంతంగా జరిగిందన్నారు.

# కలనెరవేరుతున్న వేళ!

## టిటిడి ఉద్యోగులకు సొంత ఇంటి స్థలాలు రెడీ

## -నేడు అరణ్యం సందర్శనకు ఉద్యోగులు



తిరుమల, ఆగస్టు 28ప్రభాతవార్తప్రతినిధి:

పట్టువిడవని విక్రమార్కులా ఎట్టకేలకు టిటిడి ఉద్యోగులు తమ సొంత ఇంటి కలను సాకారం చేసుకున్నారు. సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని ఇంటిస్థలాల కల సోమవారంతో నెరవేరుతోంది. ఇందుకోసం అర్హులైన టిటిడి ఉద్యోగులు సోమవారం ఉదయం తిరుపతి నుంచి వాహనాల్లో బయలుదేరి వడమాలపేటమండలం అరణ్యం ప్రాంతానికి చేరుకోనున్నారు. అక్కడ స్థలాలు పరిశీలించి వారికి కేటాయించిన ఇంటిపట్టాలు అందుకోనున్నారు. ఆ దిశగా టిటిడి ఉద్యోగసంఘాల నాయకులు అర్హులైన ఉద్యోగులకు వాట్సాప్ సందేశాలు పంపారు. స్థలాలను చూడటానికి రావాలని కోరారు. టిటిడి ఉద్యోగుల ఇళ్లస్థలాల కేటాయింపుకు సంబంధించి ఇప్పటికే అవసరమైన నిధులను టిటిడి, జిల్లా యంత్రాంగానికి సుమారుగా 62కోట్ల రూపాయలు నిధులను కూడా చెక్కురూపంలో అందజేసిన విషయం విదితమే. అయితే ఆ భూమిని అధికారికంగా టిటిడికి అందజేయాల్సిన జిల్లాయంత్రాంగం ఎందుకో జాప్యం చేస్తోందని ఉద్యోగసంఘాలు పలు దఫాలుగా జిల్లా కలెక్టర్‌ను కలసి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంగా ఇటీవల పత్రికల్లో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. గత వారం "వార్త"దినపత్రికలో ఉద్యోగుల ఇళ్లస్థలాల కేటాయింపుకు ప్రభుత్వం సిద్ధం అనే ప్రత్యేక కథనం వెలువడింది. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తమవంతు కృషి చేశారు. తిరుపతి జిల్లా వడమాలపేటమండలం అరణ్యంపాదిరేడు ప్రాంతంలో సుమారు 300 ఎకరాలు భూమిని టిటిడికి కేటాయించింది. 300 ఎకరాల భూమిలో ఒక్కో ఉద్యోగికి 40 అంకణాలు కేటాయించినా 4,500మంది వరకు ఉద్యోగులకు సొంత ఇంటికల సాకారమవుతోంది.

## ప్రతి ఇంటికి జగనన్న సంక్షేమ ఫలాలు

### మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సదుం, సోమల, ఆగస్టు 28 ప్రభాతవార్త :

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని రాష్ట్ర ఇందన, అటవీ, పర్యావరణ శాఖామాత్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సోమలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈసందర్భంగా ఇరికిపెంట, మేటిమంద, గాదేంగొల్లపల్లె, ఒంటిల్లు తదితర గ్రామాల నుంచి వంద కుటుంబాలకు చెందిన తెదేపా నాయకులు కార్యకర్తలు మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైకాపాలో చేరారు. వారందరికి మంత్రి వైకాపా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఇందులో బాగంగా సోమలలో 43 ఏళ్ల నుంచి తెదేపాలో ఉన్న జబ్బార్‌సాహెబ్ కుటుంబం కూడా వైకాపా గూటికి చేరారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయానికి అందరు మంత్ర ముగ్దులై జగనన్న నాయకత్వాన్ని బలపరుస్తున్నారన్నారు. సోమల మండలంలో ఎక్కడా రాజకీయాలు, కులాలు, మతాలు చూడకుండా అందరికి పథకాలు అందజేస్తున్నామన్నారు. గత 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నప్పటికి ఎప్పుడూ ప్రతి పక్షంలోనే ఉన్నామని జగన్‌మోహనరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ప్రతి పల్లెకు తాగునీటి సమస్య తీర్చేందుకు ఒవర్‌హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నామని చెప్పారు. చిత్తూరు పడమట ప్రాంతంలో మూడు రిజర్వాయర్లు మంజూరు చేశామన్నారు. ప్రతి గ్రామానికి రోడ్లు, మురుగునీటి కాలువలు, పంచాయతీలలో ప్రభుత్వ భవనాలు నిర్మించామన్నారు. ఈమూడేళ్ల పాలనలోనే సీఎం ఇంత అభివృద్ధి చేస్తే వచ్చే ఎన్నికల్లో మళ్లీ అందరు మద్దతు ఇస్తే ఇంకా ఎంతో అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమాలలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, తితిదే బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఎంపీపీ ఈశ్వరయ్య, జడ్పీటీసీ కుసుమ, సోమల మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు అరుణ, మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మోహన్‌కుమార్, సర్పంచిలు, ఎంపీటీసీ సభ్యులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయన సదుం మండలం మీదుగా సోమలకు వెళుతూ మార్గమధ్యంలో గార్గేయనదిపై నిర్మాణంలోఉన్న వంతెన పనులను పరిశీలించారు. వీలయినంత తొందరగా పనుల పూర్తయ్యేలా చూడాలని అదికారులను ఆదేశించారు.

## దేశం గర్వపడేలా జగనన్న పాలన

### ఆస్ట్రేలియాలో మంత్రి ఆర్.కె.రోజా



పుత్తూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త :

భారతదేశం గర్వపడేలా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. ఆదివారం ఆస్ట్రేలియాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చింతలచెరువు సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రవాస భారతీయుల సమావేశంలో ఆమె, మోదుగుల వేణుగోపాలరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. నవరత్న పథకాలతో ప్రతి పేదవాని ఇంట వెలుగులు నిండాయని ప్రతిక్షణం ప్రజల కోసం ఆలోచించే జగన్మోహనరెడ్డి వంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా వుండడం వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి నాయకుడంటే ఇలా వుండాలని జగనన్న నిరూపించారని తెలిపారు. దేశం కోసం యుద్ధం చేస్తే సైనికుడని, ధర్మం కోసం యుద్ధం చేస్తే రాముడని, పేదల సంక్షేమం కోసం పాటుపడితే నాయకుడని అలాంటి నాయకుడే ముఖ్యమంత్రి జగన్ అని పేర్కొన్నారు. తాను ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేదల సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతున్నాయని తెలిపారు. విదేశీ చదువులకు కూడా విదేశీ విద్యా దీవెన పథకాన్ని ప్రవేశపెట్టిన ఏకైక నాయకులు జగన్ అని, ఆయన స్థాపించిన పార్టీలో పనిచేస్తున్నందుకు గర్వపడుతున్నానని తెలిపారు. 2024వ సంవత్సరంలోనూ ఇదే జనరంజకమైన పాలన కొనసాగించేందుకు ఎన్నారైలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. సోషల్ మీడియా ద్వారా తమకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో భరత్, బ్రహ్మారెడ్డి, రామంజీ, మణిదీప్, తరుణ్, సతీష్ పాటి తదితరులు పాల్గొన్నారు.

షార్ ఉద్యోగుల

## అభివృద్ధి సంక్షేమాలకు 'సహకారం'



శ్రీహరికోట (తడ), ఆగస్టు 27 ప్రభాతవార్త

శ్రీహరికోటలోని సతీష్‌థవన్ అంతరిక్ష కేంద్రంలో రాకెట్ ప్రయోగాలే కాకుండా అక్కడి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల అభివృద్ధి, సంక్షేమాలకు సహకార సంఘం ఏర్పాటై ఉంది. 40 ఏళ్లకు ముందే భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రధాన కేంద్రాలలో ఉద్యోగుల కోసం సహకార సంఘాలు ఏర్పడ్డాయి. శ్రీహరికోటలోనూ షార్ ప్రాజెక్ట్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఏర్పాటైంది. ప్రస్తుతం ఈ సంఘానికి ఇక్కడ 1862 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఆరుగురిని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఇటీవలే ఎన్నుకున్నారు. శ్రీహరికోటతో పాటు తిరుపతి సమీపంలోని గాదంకి రాడార్ సెంటర్‌లోనూ ఓటర్లుగా సభ్యులు నమోదై ఉన్నారు. వీరిలో 18 మంది పోటీ చేయగా, ఎక్కువ ఓట్లు సాధించిన ఆరుగురిని ఎన్నికల అధికారులు షార్ హెడ్ పీజీ–1 కేఎన్ హరి ప్రకటించారు. వీరిలో వి.రామాంజనేయ, ఎ.రామారావు, ఎం.శ్రీధర్ చౌహాన్, కెవి సురేష్‌బాబు, ఎటి నాయుడు, యు.కృష్ణ ఉన్నారు. వీరంతా త్వరలోనే సమావేశమై బాధ్యతలు స్వీకరించడంతో పాటు అధ్యక్షుడు, చెక్‌పవర్ హోదా కలిగిన కార్యదర్శి, ఉపాధ్యక్షుడు వంటి పదవులు చేపడతారు. ఇప్పటికే శ్రీహరికోటలోని ఈ సహకార సంఘం గత పాలకవర్గాల సహకారాలతో ఎంతో మంది ఉద్యోగులకు రుణాలు ఇప్పించడం, సంక్షేమ పథకాలు అమలు చేయడం వంటివి చేస్తున్నారు. కొత్త సహకార సంఘం కూడా అర్హులైన వారికి రుణాలు ఇవ్వడంతో పాటు పదవీ విరమణ అనంతరం కూడా వారిని గౌరవంగా సత్కరించి సహకార సంఘం ద్వారా సాయం చేసే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఉద్యోగులు బ్యాంకులు చుట్టూ రుణాల కోసం తిరిగే ఇబ్బందులు తలెత్తకుండా తమ సహకార సంఘం ఆదుకుంటుందని చెప్తున్నారు. అర్హులైన ఉద్యోగులు రుణాలకు దరఖాస్తు చేసుకుంటే నలుగురు సహచరులు పరిశీలించి వారి వేతనానికి 25 రెట్లు దాకా రుణ సదుపాయం కల్పించేలా ఈ సొసైటీ ముందుకు వెళుతోంది. కొత్త సొసైటీ షార్‌లో మరింతమందిని ఆదుకుని ఉద్యోగ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఇంకా చురుగ్గా కొనసాగించాలని సభ్యులు కోరుతున్నారు.

బిందుసేద్యానికి

## ప్రతిప్రాంతానికీ పరికరాలు

### –జిల్లాలో రూ.92.14కోట్లతో 9800హెక్టార్లలో సాగు

పుంగనూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త :

పూర్తిమెట్టప్రాంతమై ప్రతికూల వర్షాభావంతో ఏటా పలు సీజన్లలో పంటలను నష్టపోతున్న జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు రూ.98.14కోట్లతో బిందుసేద్యపరికరాలు అందచేస్తున్నామని రాష్ట్రఅటవీ విద్యుత్ శాస్త్రసాంకేతిక, భూగర్భవనరులశాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తన స్వంత నియోజకవర్గకేంద్రంలో ఉద్యానవనశాఖ ద్వారా రైతులకు బిందుసేద్యపరికరాలు అందచేసే వాహనాలను పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పూర్తిగా వర్షాధారమైన ఈప్రాంతాలలో బిందుసేద్యంపై రైతులు మంచి అవగాహన కలిగి ఉండడంతో వారికి పరికరాలు ఇచ్చిప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతుశ్రేయస్సు అభినందనీయమన్నారు. కాగా జిల్లాకు 24బిందుసేద్య కంపెనీలను కేటాయించామని, రైతులు ఆర్‌బికేల వద్ద పారదర్శకమైన పద్దతిలో తమకు కావాల్సిన కంపెనీల నుంచి బిందుసేద్య పరికరాలు తీసుకోవచ్చునా న్నరు. చిన న్న, సన్నకారురైతులకు గతంలో ఉన్న సీలింగ్ రూ.2లక్షల నుంచి రూ.2.18కు, పదెకరాలలోపు వారికి రూ.2.8లక్షల నుంచి రూ. 3.46లక్షలవరకు పెంచామన్నారు. ఎంపి రెడ్డెప్ప మాట్లాడుతూ సాధారణసేద్యం ఎక్కువ నీటిని వాడడం వల్ల దిగుబడి తగ్గిపోయి, నాణ్యతలు కూడా లోపిస్తాయన్నారు. బిందుసేద్యంలో తగినంత నీరు మాత్రం రావడంవల్ల మంచి దిగుబడి ఉంటుందన్నారు. రైతులు ఈసదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, తితిదే సభ్యుడు పోకల అశోక్‌కుమార్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్, జిల్లా ఉద్యానవనశాఖాధికారి మధుసూదనరెడ్డి, ఉపాధిపథక రాష్ట్రసభ్యుడు ముత్తంశెట్టివిశ్వనాథ్, రాష్ట్రజానపదకళల అకాడమీ ఛైర్మన్ కొండవీటి, పిఎంకే ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డియాదవ్, ఎంపిపి భాస్కరరెడ్డి, జడ్పీటిసి జ్ఞానప్రసన్న, ఏఎంసి ఛైర్మన్ నాగరాజరెడ్డి, తహసీల్దార్ వెంకట్రాయలు, ఎంపిడిఓ రాజేశ్వరి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజలు తిరగబడితే రోడ్లపై వైకాపా నేతలు తిరగలేరు : అమరనాథరెడ్డి



కుప్పంరూరల్, ఆగస్టు 28 ప్రభాతవార్త

ప్రజలు తిరగబడితే వైకాపా నేతలు రాష్ట్రంలో రోడ్లపై తిరగలేదని మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కుప్పం తెదేపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పం అంటే శాంతికి మారుపేరని తాజాగా జరిగిన పరిణామాలు ఊహించలేనివన్నారు. జడ్‌ప్లస్ కేటగిరీలో ఉన్న ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు పర్యటనలోనే తెదేపా శ్రేణులపై దాడులు చేసి వైకాపా నేతలు రాష్ట్రాన్ని ఏం చేస్తామో చూపించారని విమర్శించారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై లేదా అని ప్రశ్నించారు. జిల్లా ఎస్పీ కుప్పం సంఘటనలను కంట్రోల్ చేయలేకపోయారన్నారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు హత్యలు చేసేవ్యక్తా అని ప్రశ్నించారు. అసలు సంబంధం లేనివారిపై పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. వైకాపా నేతలు సిఎం జగన్‌రెడ్డి లాగా పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. అన్నంపెట్టే అన్న క్యాంటీన్లను ధ్వంసం చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని ముందు తగు మూల్యం చెల్లించుకుంటారన్నారు. అసలు ఇంటెలిజెన్స్ వ్యవస్థ పనిచేస్తోందా అని ప్రశ్నించారు. వైకాపా పాలనపై సామాన్యులు ఏమనుకుంటున్నారో సిఎం జగన్‌రెడ్డి సర్వే చేయించుకోవాలని ప్రజలు ఛీదరించుకుంటున్నారని విమర్శించారు. టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం చేతనైతే అభివృద్ధి చేయాలే గానీ బయటి ప్రాంతాలనుంచి కార్యకర్తలను తెచ్చి కుప్పంలో అలజడులు సృష్టించడం మానుకోవాలన్నారు. వైకాపా నాశనానికి నాంది ప్రారంభమైందన్నారు. ఈ సమావేశంలో టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, నేతలు సాంబశివం, రామచంద్రనాయుడు, జిఎం రాజు, ధీరజ్, న్యాయవాది శ్రీకాంత్, కౌన్సిలర్ సురేష్, నేతలు విష్ణు, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.


వర్షాలకు ఉరుస్తున్న గ్రంథాలయ భవనం

4 లో



## ఉష్ణోగ్రతలు

28/8/2022



- తిరుపతి 30 డిగ్రీలు
- చిత్తూరు 32 డిగ్రీలు
- మదనపల్లి 26 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 32 డిగ్రీలు
- వెంకటగిరి 33 డిగ్రీలు
- గూడూరు 33 డిగ్రీలు

# కాణిపాకంలో శరవేగంగా బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

కాణిపాకం, ఆగస్టు 28 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 31 నుండి జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల గడువు దగ్గర పడుతుండడంతో ఏర్పాట్లు వరవేగంగా సాతుతున్నాయి. దేవస్థానంలో ఈనెల 31 నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతిఏటా 21 రోజులు పాటు జరిగే ఈఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తుంటారు. కరోనా నేపథ్యంలో గత రెండేళ్ళుగా దేవస్థానంలో ఉత్సవాలను ఏకాంతంగా నిర్వహించారు. అయితే ఈఏడాది కరోనా తగ్గుముఖం పట్టడంతో గతంలో వలె యథావిధిగా నిర్వహించడానికి దేవస్థానం ఏర్పాట్లును చేపడుతోంది. బ్రహ్మోత్సవాల ప్రారంభానికి కేవలం రెండు రోజుల వ్యవధి మాత్రమే వుండడంతో శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రధాన ఆలయ కుంభాభిషేకం సందర్భంగా ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయాలకు రంగులు వేయడం, ప్రధాన ఆలయంలో రంగవల్లులు తీర్చిదిద్దడం, విద్యుత్ దీపాలంకరణ వంటి పనులు పూర్తి చేయడంతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు దాదాపు పూర్తయింది. మిగిలిన చిన్న చిన్న ఏర్పాట్లును సోమవారం లోగా పూర్తి చేయడానికి ఆలయ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈమేరకు ప్రధాన ఆలయ ప్రాకార మండపంలో సాలాహారాల్లో స్వామివారి ప్రతిమలను అమర్చుతున్నారు. అలాగే ఆలయ పరిసరాలు, ఇతర ప్రాంతాల్లో విద్యుద్దీపాల కటౌట్‌లు, ఆర్చిల ఏర్పాటుకు కార్మికులు సిద్ధంచేస్తున్నారు.





## బంగారం ధరలు

27/8/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,805

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,242

## కోడిగ్రుడ్ల ధరలు

27/8/2022



కోడిగ్రుడ్డు :రూ.5.00

1 డజను: రూ.60.00

